క్లుప్తంగా

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భక్తులు బుధవారం కిటకిటలాడారు. దేవాలయ పాలక వర్గం ఆధ్వర్యంలో అర్చక స్వాములతో స్వామి మూలవిరాట్‌లకు విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు జరిగాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కె.వి.శ్రీరంగనాయకితో తిరుప్పావై ఆధ్యాత్మిక ప్రవచనం చేపట్టారు. గాయకులు జరీనా, పరమేశ్వరి బృందం భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ధార్మిక ప్రాంగణంలో స్వాములకు సద్ధి కార్యక్రమం, చండీహోమం జరిగాయి.

పారదర్శకంగా తెనాలి ప్రాంత అభివృద్ధి



తెనాలిరూరల్: నూతన సంవత్సరంలో తెనాలి ప్రాంతాన్ని పారదర్శకంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల, పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక బోస్ రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, జిల్లా ఎస్పీ ఎస్. సతీస్‌కుమార్, వివిధ శాఖల అధికారులు మంత్రిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విజయవాడ, గుంటూరు నగరాలకు దీటుగా తెనాలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెవేరుస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లే విధంగా కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు.

సామాజిక చైతన్యానికి కళలు దోహదం



లక్ష్మీపురం: సామాజిక చైతన్యానికి కళలు దోహదపడతాయని పాటకు ప్రభుత్వాల్ని కూల్చిన చరిత్ర కూడా ఉందని, సామాజిక మార్పుకు పాట ఒక సాధనంగా ఉపయోగపడుతుందని ఇప్టా జాతీయ కార్యదర్శి గని అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా సాంస్కృతి కార్యక్రమం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత, పాత సినిమాల్లో పాటల్లోని ప్రేమ గాతాలు కూడా సామాజిక స్పృహ ఉండేదన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సినీ దర్శకులు కనగాల జయకుమార్ మాట్లాడారు. అనంతరం పలువురు సాంస్కృతి కార్యక్రమాలు సినీ, జానపద గేయాలను ఆలపించారు.

ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ స్టాండ్ ప్రారంభం



లక్ష్మీపురం: ది గుంటూరు నగర ఆటో డ్రైవర్స్- వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జీజీహెచ్ వద్ద ఏర్పాటు చేసిన నూతన ఆటో స్టాండ్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ప్రారంభించారు. తొలుత సంఘం పతాకాన్ని యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు కోట మాల్యాద్రి అధ్యక్షతన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్‌కు ఎలాంటి సమస్యలు వచ్చిన అందుబాటులో ఉంటామని బలహీన వర్గాల వారి ఆశాజ్యోతి కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. అనంతరం ఆటో డ్రైవర్స్- వర్కర్స్‌కి 2025 నూతన సంవత్సరం సందర్భంగా యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి మంగా శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, సిపిఐ జిల్లా కమిటీ నగర కమిటీ సభ్యులు చల్లా మరియదాస్, సమితి సభ్యులు ఆకిటి రామచంద్రుడు, స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు గౌడు శివ, ఇసుబు, నాయకులు బుడే, మస్తాన్, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

పొన్నూరు: నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత యువత కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గు లు వేశారు. 2024 సంవత్సరానికి గుడ్ బై చెబుతూ 2025 కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేసిన ముగ్గులు ఆకర్షణీయంగా దర్శనమిచ్చాయి. విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, యువత ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటూ బుధవారం సందడిగా గడిపారు.

సంతోషంగా జీవించాలి: అంబటి మురళీకృష్ణ

వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబటి మురళీకృష్ణ నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి, నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రజలంతా ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పొన్నూరు ఎంపీపీ భవనం పద్మలీల, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు అంబటి వెంకటేశ్వరరావు, షేక్ నాజర్, వట్టిప్రోలు రంగారావు, అనిలా కుమారి, ఈశ్వరయ్య, మూర్తి రాజు తదితరులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న అంబటి మురళీకృష్ణ

విజ్ఞాన్‌లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, విజ్ఞాన్ లారా, విజ్ఞాన్ ఫార్మసీ, విజ్ఞాన్ జూనియర్ కాలేజీలలోని విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కోటి ఆశలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించడానికి సరికొత్త మార్గాలను అన్వేషించాలని సూచించారు. నూతన టెక్నాలజీలపై అవగాహన పెంచుకున్న విద్యార్థులకు మాత్రమే భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగాలు దక్కుతాయని తెలిపారు. 2025లో విద్యార్థులు కష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని... వాటిని సాధించేందుకు పట్టుదలతో కృషిచేయాలని సూచించారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ కార్పొరేట్ ప్రపంచంలో యువతకు విస్తృత అవకాశాలున్నాయని, వాటిని సాధించేందుకు అవసరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పీఎంవీ రావు, మాజీ డీజీపీ, విజ్ఞాన్ యూనివర్సిటీ అడ్వైజర్ మాలకొండయ్య, లారా కళాశాల ప్రిన్సిపాల్ ఫణీంద్రకుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో నూతన సంవత్సర వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అర్ధరాత్రి సమయంలో యువకులు కేక్‌లు కట్ చేసి, టపాసులు పేల్చి కేరింతలు కొట్టారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పెద్దలు, మహిళలు, విద్యార్థులు, యువకులు కొత్త సంవత్సర సంబరాలను ఘనంగా నిర్వహించారు. చేబ్రోలు, శలపాడు, వడ్లమూడి, వేజండ్ల, శ్రీరంగపురం తదితర గ్రామాల్లో నూతన సంవత్సరం సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చేబ్రోలులోని నాగేశ్వరస్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రంగనాథ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శలపాడు కోదండ రామస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విజ్ఞాన్ వేడుకల్లో చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, మాజీ డీజీపీ మాలకొండయ్య



శలపాడు కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎస్ఎన్‌టీ స్కూల్లో కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు

ఉత్సాహంగా న్యూ ఇయర్ సంబరాలు



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని ఏటుకూరు బైపాస్‌లోని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కటింగ్ చేసి నియోజకవర్గం ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్స్ కీలక పాత్ర

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని చలపతి ఫార్మసీ కళాశాలలోని ఫార్మసీ ప్రాక్టీస్ ఫార్మాకాలజీ విభాగాల సంయుక్తంగా మిషన్ లెర్నింగ్ అప్లికేషన్స్ ఇన్ ఫార్మసీ అండ్ డ్రగ్ డెవలప్మెంట్ అంశంపై ఒక్కరోజు వర్క్ షాప్ 6వ తేదీ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు బుధవారం తెలిపారు. వర్క్‌షాప్‌లో శిక్షణ ఇచ్చేందుకు వీఐటీ ఏపీ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఈ శ్రీనివాసరెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను విడుదల చేశారు.

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

నెహ్రూనగర్: నూతన సంవత్సరంలో నగర ప్రజలందరికి అన్ని శుభాలే జరగాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మేయర్‌ను సంపత్ నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు బొకేలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా నగర ప్రజలకు నగర పాలక సంస్థ కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024లో కొందరికి ఒడిదుడుకులు ఏర్పడినా 2025లో అన్ని శుభాలే జరిగి అందరు సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నామని మేయర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొన్నారు.



మేయర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న కార్పొరేటర్లు

రైతుసంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

తెనాలి: ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, తెనాలి డివిజన్ కమిటీ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రైతాంగానికి ఉపయోగపడేలా క్యాలెండర్‌ను తీసుకొచ్చిన కమిటీని అభినందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ మాటాలడుతూ గతంలో గ్రామంలో కరణం, గ్రామమోతుబరి దగ్గరే క్యాలెండర్ ఉండేదని, తిథి, వార, నక్షత్రాలతోపాటు వ్యవసాయ సంబంధమైన విషయాలను వారి ద్వారా తెలు సుకునే ఆనవాయితీ ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుతం రైతాంగానికి ఉపయోగపడేలా క్యాలెండరును తీసుకురావటం సంతోషంగా ఉందన్నారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడారు.

విధులకు ఆటంకం కలిగించిన యువకులపై కేసు

తెనాలి రూరల్: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకులపై కేసు నమోదైంది.వివరిలిలా ఉన్నాయి. తెనాలి వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాటాక రౌండ్స్‌కి తిరుగుతున్న సందర్భంలో రామలింగేశ్వరపేట పాత డిపో సెంటర్ వద్ద నలుగురు యువకులు మద్యం తాగి హల్‌చల్ చేస్తున్నారు. అదే సమయంలో పోలీసులు వెళ్ళగా వారితో ఘర్షణకు దిగి వాహనాన్ని అడ్డుకున్నారు.ఈ నేపథ్యంలో నలుగురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: గర్భిణులు సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలుగుతారని బఫర్ వైద్యురాలు శాంతి అన్నారు. మండలంలోని రేపూడి గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. 95మందికి షుగర్, బీపీ, థైరాయిడ్, యూరిన్ పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, ఏఎన్ఎంలు వెళంగిణీ రాణి, శివకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

సీపీఎం నాయకుడు బాలరాజు

దుగ్గిరాల(తాడేపల్లిరూరల్): మతోన్మాద శక్తుల నుంచి భారత రాజ్యాంగాన్ని, మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీపీఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు అన్నారు. బుధవారం దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి కరపత్రా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ తెలియజేసి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ మూడవసారి అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటున్నాయని అన్నారు. బీజేపీ విధానాలను ప్రజలందరూ వ్యతిరేకించాలని కోరుతున్నామన్నారు. గ్రామ పంచాయితీ వైస్ ప్రెసిడెంట్ ఎం.దుర్గ, ఎం.అంజయ్య, కె.బిక్షాలు, శశిరేఖ, శ్యామల, పార్వతి, చిరంజీవి, ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

తాడేపల్లిరూరల్: నూతన సంవత్సరం సందర్భంగా మంగళగిరి సబ్ ట్రెజరీ కార్యాలయంలో సబ్ ట్రెజరీ అధికారులు ఎ.శ్యామ్‌బాబు, బి.శేషసాయిలను బుధవారం ఏపీ పెన్షనర్ అసోసియేషన్ మంగళగిరి శాఖ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌టీఓ శ్యామ్ బాబు మాట్లాడుతూ పెన్షనర్స్ నుంచి లైఫ్ సర్టిఫికేట్స్ తీసుకోవడం జరుగుతోందని, పెన్షనర్స్ జీవన ప్రమాణ యాప్ ద్వారా ట్రెజరీలో నమోదు చేసుకోవాలని అన్నారు. అసోసియేషన్ నాయకులు కూడా పెన్షనర్స్‌కు ఈ సమాచారాన్ని అందజేయాలని సూచించారు. సబ్ ట్రెజరీ కార్యాలయం ఆవరణలో ఎస్టీఓ గది నిర్మాణానికి సహకరించిన అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం వీరాంజనేయులు పెన్షనర్లకు స్వీట్లు, పెన్నులు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.గోపిరెడ్డి, పి.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు బాపనపల్లి వీరాంజనేయులు, కోశాధికారి పి.కుమారస్వామి, అసోసియేషన్ ప్రతినిధులు అందే కనకలింగేశ్వరరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అటెన్షన్













నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నగరంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. డ్రంకెన్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా నగరంలో పర్యటిస్తూ అర్ధరాత్రి వాహనాలపై తిరుగుతున్న యువతను హెచ్చరించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన యేల్చూరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి ఆయన తీసుకెళ్లారు. చాంబర్ మాజీ అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి, కార్పొరేటర్ ఈ.వరప్రసాద్, టీడీపీ నాయకులు కొనకళ్ల సత్యం, చిట్టిప్రోలు రఘు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

నగరంపాలెం: కొత్తపేటలోని కుగ్లర్ ఆస్పత్రి ఆవరణలోని ట్రినిటీ గురుమండలంలో బుధవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ప్రొఫెసర్ కె.నిరంజన్ (హైదరాబాద్) ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నూతన సంవత్సర ప్రత్యేకతను వివరించగా, ఈ ఏడాది అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. పలువురు భక్తి గీతాలను ఆలపించారు. పరిసర ప్రాంతాల వారు హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘకాపరులు రెవ.జె.దైవాశీర్వాదం, రెవ.పి.రమేష్, ట్రినిటీ ప్యారిష్ చైర్మన్ బి.గ్రేస్‌భీమరాజు, కోశాధికారి బత్తుల లెనిన్ పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న కారు

తప్పిన పెనుప్రమాదం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి ప్రాతూరు రోడ్డులో మలుపు తిరుగుతున్న కారును తప్పించబోయి అతివేగంగా వస్తున్న కారు బుధవారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో వున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రాతూరు రోడ్డులోని ఓ ప్రభుత్వం కార్యాలయం నుంచి ప్రభుత్వ వాహనం కుంచనపల్లి వైపు మలుపు తిప్పుతుండగా కుంచనపల్లి నుంచి ప్రాతూరు వైపు వెళుతున్న మరో ప్రభుత్వ వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టి రోడ్డుపక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొంది. ట్రాన్స్‌ఫార్మర్ ఐదు అడుగుల ఎత్తులో బలంగా కాంక్రీట్ దిమ్మె వేయడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు, స్తంభానికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. కాంక్రీట్ దిమ్మె లేకపోతే పెనుప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు 11 కేవీ, 33 కేవీ కావడం, విద్యుత్ స్తంభానికి ఎటువంటి అంతరాయం కలగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి కారణమైన రెండు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నారు.



కారును పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

4 నుంచి శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు

నగరంపాలెం: స్థానిక మారుతీనగర్‌లోని శ్రీమారుతీ దేవాలయంలో శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీమారుతి దేవాలయ సంఘం, శ్రీరామ సేవా సమితి వారణాసి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభి షేక మహోత్సవాలను ఈనెల 4 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు తంగిరాల శ్రీనివాసరావు తెలిపారు. మారుతీనగర్ దేవాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. ఈనెల 3వ తేదీన మారుతీనగర్ పుర వీధుల్లో శ్రీసపరివార సమేత శ్రీరామచంద్రస్వామి శోభాయాత్ర ఉంటుందని అన్నారు. తొలి రోజు శ్రీ మద్రామాయణ పారాయణ, హోమాలు, శ్రీసపరివార సమేత శ్రీరామచంద్ర స్వామికి సహస్ర నామార్చనలు, ఐదారు, తొమ్మిది తేదీల్లో పవళింపు సేవలు, ఏడో తేదీన శ్రీఆంజనేయస్వామికి సహస్రనామార్చనలు, నాగవల్లీ దళాలతో, ఎనిమిదిన సపరివార సమేత శ్రీరామచంద్రస్వామికి పంచామృత, ఫలరస, సుగంధ ద్రవ్య అభిషేకాలు, 10న వైకుంఠ ఏకాదశి, శ్రీ సీతాఅమ్మవారి లలితా సహస్రనామ అర్చన, 11న శ్రీసీతారామచంద్రస్వామి శాంతి కల్యాణ మహోత్సవం, 12 న శ్రీమారుతీ దేవాలయ సంఘ పక్షాన పండిత సత్కార కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.